క్లుప్తంగా

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



సత్తెనపల్లి: పట్టణంలోని పాతబస్టాండ్‌లోని సీపీఎం కార్యాలయం వద్ద సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని సీనియర్ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, సీపీఎం సీనియర్ నాయకుడు గద్దె చలమయ్య ప్రారంభించారు.

పూజారి రంగాచార్యులు మృతి



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ పూజారి చిత్రకవి రంగాచార్యులు అలియాస్ మురళి (67) గురువారం కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. 1956 మే 11న జన్మించిన ఆయన 2023 మే 11న తన జన్మదినం రోజే మరణించడం గమనార్హం. ఆలయ శ్రీవారి సేవా సమాజం కమిటీ సభ్యులు, భక్తులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పుస్తక పఠనంతో సృజనాత్మకత

క్రోసూరు: పుస్తకపఠనం విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తుందని గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు జ్ఞాపకశక్తి పరీక్షలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందించారు. విద్యార్థులకు పుస్తకసమీక్ష, నీతికథల పోటీలు నిర్వహిస్తున్నట్టు వీరాంజమ్మ వివరించారు. ఇంగ్లిషు, గణితం, తెలుగు ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు.

టెన్త్ ప్రతిభావంతులకు ప్రోత్సాహకం పంపిణీ



సత్తెనపల్లి: మండలంలోని నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి నగదు ప్రోత్సాహకాలను అందించారు. గతంలో ఆయన పాఠశాల సందర్శనకు వచ్చిన సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన వారికి రూ.5వేల నగదు బహుమతిని ప్రధానోపాధ్యాయులు తోక సోమనాథ్ ద్వారా గురువారం అందించారు. పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన కొల్లిపర శ్రీఇంద్రజ (529/600)కు రూ.3 వేలు, ద్వితీయ స్థానం సాధించిన పి.తేజస్విని (525/600)కి రూ.2 వేలు నగదును విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అందించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు భాస్కర్ పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



రాజుపాలెం: మండలంలోని అంచులవారి పాలెం గ్రామానికి చెందిన అంచుల సాయి ఇటీవల మృతిచెందాడు. దీంతో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సహకారంతో రూ.లక్ష బీమా చెక్కు మంజూరైంది. సర్పంచ్ అంచుల రామాంజనేయులు గురువారం గ్రామ సచివాలయంలో సాయి భార్యకు రూ.లక్ష చెక్కును అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరిసూరమ్మనాగేశ్వరరావు, గ్రామ సచివాలయాల కన్వీనర్ సోమశంకరరావు, అంచుల పుల్లయ్య, పీఎస్ ముక్తార్, వెల్ఫేర్ అసిస్టెంట్ నవ్య పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట వ్యతిరేకం



పెదకూరపాడు: పెదకూరపాడులో 13 ఏళ్ల బాలికకు వివాహం చేస్తుండగా ఐసీడీఎస్, రెవెన్యూ అధికారులు అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తహసీల్దారు క్షమరాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. కార్యక్రమంలో సీడీపీవో స్వర్ణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ మున్ని తదితరులు ఉన్నారు.

హనుమాన్ శోభాయాత్రకు ఆహ్వానం



మంత్రి అంబటి రాంబాబును సత్కరిస్తున్న నారాయణసేన నగర సంకీర్తన సంఘం సభ్యులు

సత్తెనపల్లి: హనుమత్ జయంతి సందర్భంగా ఈనెల 14న మధ్యాహ్నం 3.30 గంటలకు పట్టణంలోని ప్రధాన రహదారిలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ నుంచి హనుమాన్ శోభాయాత్ర (బైక్ ర్యాలీ) ప్రారంభమవుతుందని నారాయణసేన నగర సంకీర్తన సంఘం సభ్యులు తెలిపారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు గురువారం నారాయణసేన నగర సంకీర్తన సభ్యులు ఆహ్వానపత్రాన్ని అందించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొంటారని, హనుమాన్ శోభా యాత్రలో భాగస్వాములై హనుమంతుని ఆశీస్సులు పొందాలని కోరారు. మంత్రి అంబటి రాంబాబును దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల. సాంబ శివరావు, సంస్థ సభ్యులు దేవరశెట్టి రవికుమార్, కందకట్ల నాగేశ్వర రావు, కొలిపాకుల బాలాజీ, నాగేశ్వరరావు, ఆంజనేయులు, సత్యనారాయణ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణలో ప్రజా భాగస్వామ్యం ముఖ్యం

పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్



పట్టణంలో పర్యటించి సూచనలు చేస్తున్న రవీంద్ర రత్నాకర్

సత్తెనపల్లి: దోమల నివారణలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీందర్ రత్నాకర్ చెప్పారు. జనవరిలో పట్టణంలోని బోయ కాలనీ నివాసి మల్లా రామకోటయ్య డెంగీ బారిన పడి కోలుకోవడంతో గురువారం జోనల్ మలేరియా అధికారి డాక్టర్ వినోద్ కుమార్ ఆయన ఇంటి పరిసరాలను పరిశీలించారు. రామకోటయ్య ఇంటిని సందర్శించి సూచనలు చేశారు. ఇంటిలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ఫ్రైడే డ్రైడేగా పాటించాలని, నీటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల వల్ల అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే దోమలను నివారించవచ్చని వివరించారు. అనంతరం వెంగళరెడ్డి నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను వైద్యాధికారిణి డాక్టర్ సిరాజున్నిసాను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌ను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో జోనల్ మలేరియా కార్యాలయ ఆరోగ్య విస్తరణాధికారి బి.మంగరాజు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి సిహెచ్ ప్రభాకర్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్స్ బి.రోశయ్య, వై.రాజేష్ పాల్, హెల్త్ అసిస్టెంట్లు ఎంపీ కిరణ్ బాబు, ఎస్ఎం హుస్సేన్, షరీఫ్, హెల్త్ సెక్రటరీ ఎ.భూలక్ష్మి, ల్యాబ్ అసిస్టెంట్ షేక్ బికారి తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుకు భూములు సిద్ధం చేసుకోవాలి



మాదలలో జరిగిన ఖరీఫ్ సాగు సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ అరుణ

మాదల(ముప్పాళ్ళ): పచ్చిరొట్ట సాగుకు పొలాలను సిద్ధం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ చెప్పారు. మాదల గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో ఖరీఫ్‌సాగు సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. ఏఓ అరుణ మాట్లాడుతూ ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. వేసవిలో పొలాలను ఖాళీగా ఉంచకుండా మినుము, కొర్రల్లాంటి స్వల్పకాలిక పంటలు సాగు చేసుకోవాలన్నారు. సమావేశంలో వీఏఏ పావని, శైలజ పాల్గొన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 50శాతం సబ్సిడీపై జనుము, జీలుగ, పిల్లిపెసరలాంటి పచ్చిరొట్ట విత్తనాలు అందించనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలతో ఆయా రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రాడ్‌బెండింగ్ మేస్త్రి అనుమానాస్పద మృతి



మృతదేహం

సత్తెనపల్లి: రాడ్‌బెండింగ్ మేస్త్రి అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన సత్తెనపల్లి పట్టణంలోని జలవనరుల శాఖ కార్యాలయం ఆవరణలో జరిగింది. గురువారం పట్టణ పోలీసులు అతడి మృతదేహాన్ని గుర్తించారు. రాజుపాలెం మండలం కొండమోడు గ్రామానికి చెందిన రాడ్‌బెండింగ్ మేస్త్రి పోపూరి శ్యామ్ కుమార్ (40) మద్యం సేవించి చేతి మణికట్టు వద్ద సీసంతో కోసుకోవడంతో అధిక రక్తస్రావం జరిగి మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి ఫిట్స్ వ్యాధి ఉందని, అప్పులు కూడా ఉన్నట్లు సమాచారం. శ్యామ్‌కుమార్ బలవన్మరణానికి పాల్పడ్డాడా లేక ఎవరి ప్రమేయమైనా ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుని జేబులో కొండమోడు నుంచి సత్తెనపల్లి వరకు తీసుకున్న ఆర్టీసీ బస్ టికెట్ ఉంది. శ్యామ్‌కుమార్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాల మార్చురీకి పోలీసులు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌బీకేల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు



అనుపాలెం ఆర్‌బీకేలో రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన అధికారి నవీన్

రాజుపాలెం: ఆర్‌బీకేల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను ఇస్తున్నందున కావాల్సిన రైతులు పేరు నమోదు చేసుకోవాలని ఉద్యాన అధికారి డి.నవీన్ తెలిపారు. అనుపాలెం రైతు భరోసా కేంద్రంలో మామిడి రైతులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. ఉద్యాన అధికారి మాట్లాడుతూ మామిడి రైతులు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పీఎంఎఫ్ఎంఈ స్కీమ్ ద్వారా మండలంలో మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు 35 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ స్కీమ్‌ను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని తెలిపారు.

యువకుడు మృతి



మాచవరం: అతిగా మద్యం సేవించి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పిల్లుట్ల గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అచ్చంపేట మండలం కోనూరుకు చెందిన కారుమంచి జోజిబాబు (35) కొన్నేళ్లుగా మల్లవోలులో నివాసం ఉంటున్నాడు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం అతిగా మద్యం సేవించాడు. పిల్లుట్ల వాటర్ ట్యాంక్ సమీపంలోని చెట్ల పొదల్లో పడిపోయాడు. ఎవరూ గమనించకపోవడంతో నాలుగు రోజుల క్రితమే గొంతు ఎండిపోయి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం వాసన రావడంతో గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.కోటయ్య తెలిపారు.

రైల్వే స్టేషన్ రోడ్డులో చోరీ

పిడుగురాళ్ల: కొబ్బరి నీళ్లు తాగుతుండగా ద్విచక్ర వాహనానికి తగిలించి ఉన్న నగదు బ్యాగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గురువారం జరిగింది. బాధితుడు నిమ్మల నరసింహారెడ్డి కథనం ప్రకారం నరసింహారెడ్డి పట్టణంలోని బ్యాంక్‌లో క్రాప్ లోన్ ద్వారా రూ.1.60 లక్షలు డ్రా చేసుకొని న్యూ వెల్లంపల్లి గ్రామానికి బయలుదేరాడు. మార్గ మధ్యలో రైల్వే స్టేషన్ రోడ్డులో కొబ్బరి నీళ్లు తాగేందుకు ద్విచక్ర వాహనం ఆపాడు. వెనుక నుంచి ద్విచక్రవాహనాలపై వచ్చిన వ్యక్తులు నరసింహారెడ్డి వాహనానికి తగిలించి ఉన్న బ్యాగ్‌ను తీసుకెళ్లిపోయారు. దీనిపై నరసింహారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గోలిలో రూ.2.20 కోట్లతో పీహెచ్‌సీ నిర్మాణం



గోలిలో పీహెచ్‌సీ నిర్మాణానికి భూమిని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

గోలి(రెంటచింతల):మారుమూల గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మండలంలోని గోలి గ్రామంలో రూ.2.20 కోట్లతో పీహెచ్‌సీ నిర్మాణం చేపడుతున్నట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. ఇప్పటికే గ్రామ సచివాలయం సమీపంలోని సర్వే నంబర్ 261-8-1సి2లో 1.50 ఎకరాల భూమిని పీహెచ్‌సీ నిర్మాణానికి పరిశీలించారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ దాడులు



పెదకూరపాడు: పెదకూరపాడు గ్రామంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అధికారి కె.ఎల్.ఎస్.మూర్తి ఆధ్వర్యంలో 37 బృందాలు గ్రామంలోని 2,900 సర్వీసులను తనిఖీ చేశాయి. తనిఖీల్లో విద్యుత్ చోరీకి పాల్పడుతున్న నలుగురిపై కేసు నమోదు చేశారు. అధిక లోడు వినియోగిస్తున్న 60 సర్వీసులకు రూ.3.50 లక్షల జరిమానా విధించినట్లు మూర్తి తెలిపారు. దాడుల్లో ఏడీఈ సురేంద్రబాబు, తులసిరామ్, కోటేశ్వరరావు, విజిలెన్స్ ఎస్సై బాబు తదితరులు పాల్గొన్నారు.

చౌటపాపాయపాలెంలో ఫ్యామిలీ డాక్టర్



రాజుపాలెం: మండలంలోని చౌటపాపాయపాలెంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కృష్ణకుమార్ 183 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. 39 మందికి బీపీ, 34 మందికి షుగర్ మాత్రలను 15 రోజులకు సరిపడా అందించారు. పది మంది గర్భిణులను, 13 మంది బాలింతలను పరీక్షించి మందులు అందించారు. ఇంటికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ అన్నాకుమారి, డీఈఓ పూర్ణ, ఆరోగ్య కార్యకర్త హుస్సేన్, ఏఎన్ఎం కోటిలింగమ్మ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తెగిపడి 80 జీవాలు మృత్యువాత



బాలెమర్రు(క్రోసూరు): బాలెమర్రు గ్రామంలోని పొలాల్లో గురువారం సాయంత్రం ఈదురుగాలికి విద్యుత్ మెయిన్‌లైన్ తీగతెగి పడి 80 జీవాలు(గొర్రెలు) మృత్యువాత పడ్డాయి. ఇవి విప్పర్ల గ్రామానికి జీవాల పోషకులు ఎర్రగొర్ల సుబ్బారావు, పాటిబండ్ల దోర్నేష్, మందపల్లి శ్రీకాంత్, మోదెల రవికి చెందినవిగా స్థానికులు తెలిపారు. 250 జీవాలను బాలెమర్రు పొలాల్లోకి తీసుకొచ్చి మేపుకుంటున్నట్లు వివరించారు. ఒక్కసారిగా వచ్చిన ఈదురుగాలికి జీవాలు బెదిరి పరిగెత్తాయి. అదే సమయంలో విద్యుత్ మెయిన్ లైన్ తీగ తెగి జీవాలపై పడింది. దీంతో విద్యుదాఘాతానికి గురై 80 జీవాలు మృత్యువాత పడ్డాయి. గ్రామస్తులు విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించారు.

మహాయజ్ఞం పోస్టర్లు ఆవిష్కరణ



మహాయజ్ఞం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రభుత్వవిప్ పీఆర్కే, ఆర్యవైశ్య నాయకులు

మాచర్ల: రాష్ట్ర ప్రజల క్షేమం కోసం శుక్రవారం నుంచి 17వ తేదీ వరకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న 108 కుడాత్మక చండీ రుద్ర, రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం పోస్టర్లను గురువారం ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) తన కార్యాలయంలో ఆర్యవైశ్య సంఘ నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం యజ్ఞం నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో అడిగొప్పల నిదానంపాటి అమ్మవారి ఆలయం, మాచర్ల ఈఓలు నరసింహబాబు, సాంబయ్య, ఆర్యవైశ్య సంఘ నేతలు కొత్తమాసు బ్రహ్మారావు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కె.కోటయ్య, కౌన్సిలర్లు మురళి, మదార్‌సాహెబ్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, పార్టీ నాయకులు



బెల్లంకొండలో షాదీఖానా భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

బెల్లంకొండ: చంద్రాజుపాలెం గ్రామంలోని వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి కల్యాణ వేడుకలో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామ నాయకులు, పెద్దలు మేళ తాళాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

షాదీఖానా, కమ్యూనిటీ భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ

బెల్లంకొండలో ముస్లింలకు షాదీఖానా భవనం, వన్నాయపాలెం గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం భూమి పూజ చేశారు. ఎంపీ లాడ్స్ నిధుల నుంచి షాదీఖానా నిర్మాణానికి రూ.25 లక్షలు, బీసీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఓర్చు సాంబశివరావు, వైస్ ఎంపీపీ బూదాటి మరియదాసు, అహ్మద్ పాషా, భద్రయ్య, చింతారెడ్డి సాయిరెడ్డి, మర్రి ప్రసాదరెడ్డి, మిల్లు వెంకటరెడ్డి, సర్పంచ్ బాబూజీ, మేకల సోమయ్య, కో-ఆప్షన్ మెంబర్ దరియా, మేకల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాదాసు రాంబాబు, మౌలాలి, బడాబచ్చా, సిరిపురం మేస్త్రీ, వేల్పుల కోటేశ్వరరావు, జడ సుబ్బయ్య, కొడవటి కోటేశ్వరరావు, తురక కొండ, గాలం రామకృష్ణ, గుడిశె నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలి



రెంటపాళ్ళలో పనిప్రదేశం వద్ద కూలీలతో మాట్లాడుతున్న లక్ష్మీశ్వర రెడ్డి

సత్తెనపల్లి: ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలు ఎప్పటికప్పుడు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల రక్షణ కోసం పని ప్రదేశాల వద్దకు గురువారం ఆయన వెళ్లారు. రెంటపాళ్ళ, కందులవారి పాలెం గ్రామాలలో పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22న నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయం వద్ద తమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సత్తెనపల్లి మండల కార్యదర్శి జమలమూడి భగత్, బగ్గి వెంకటేశ్వర్లు, చలువాది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

202 హెక్టార్లలో వరి పంటకు నష్టం

నకరికల్లు: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు 205 మంది రైతులకు చెందిన 202.8 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు గుర్తించామని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని చీమలమర్రి గ్రామంలో గురువారం ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు చీమలమర్రి, చల్లగుండ్ల, దేచవరం, కండ్లకుంట, రూపెనగుంట్ల, చాగల్లు తదితర గ్రామాల్లో పంట నష్టపోయిన రైతుల జాబితాను శుక్రవారం నుంచి మూడురోజుల పాటు సచివాలయాల్లో, రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్టు వెల్లడించారు. అభ్యంతరాలు ఉన్నట్టయితే తెలియజేయాలని సూచించారు. 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను రైతుభరోసా కేంద్రాల్లో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ-పంట నమోదు, ఉచిత పంటల బీమా గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జి.జగదీష్, వెటర్నరీ అసిస్టెంట్ సీహెచ్.తిరుపతయ్య, కార్యదర్శి ఎం.శైలేంద్రకుమార్, ఎంపీటీసీ సభ్యుడు తిరుమలశెట్టి సాంబయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను పారదోలదాం.. పర్యావరణాన్ని కాపాడదాం



శివాపురంతండాలో పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

నకరికల్లు: ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టి పర్యావరణ పరిరక్షణకు నడుంకడదామని అటవీశాఖ డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ నీలిమాదేవి సూచించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం శివాపురంతండాలో పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత అతిథులు, గ్రామస్తులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నీలిమాదేవి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ పురుషోత్తంరాజు, మండల ఉపాధ్యక్షులు దూదేకుల హుస్సేన్‌బీబాషా, సర్పంచ్ ధ్వాళీబాయి, సక్రునాయక్, ఉపసర్పంచ్ మోహన్‌నాయక్, రమావతు ధర్మానాయక్, యూత్ అధ్యక్షుడు జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న దృశ్యం

అచ్చంపేట:స్థానిక ఎస్సీ కాలనీలో స్టెల్లా యూత్ ఆధ్వర్యంలో కంభంపాటి నగేష్ స్మారక క్రికెట్ టోర్నమెంటును చర్చి సంఘ కాపరి రవికుమార్, ఇరిగేషన్ ఏఈ చిలకా భాస్కర్, వీఆర్వో సందెపోగు శేషయ్య తదితరులు ప్రారంభించారు. ముందుగా నగేష్ చిత్రపటానికి పలువురు పూల మాలలువేసి నివాళులర్పించారు. ఇరిగేషన్ ఏఈ భాస్కర్ మాట్లాడుతూ క్రీడాకారులలో స్నేహపూరిత పోటీ మాత్రమే ఉండాలని, గెలవాలన్న తపన ఉండాలని, గెలిచేందుకు చెడు మార్గాలవైపు పోకూడదన్నారు. 10 జట్లు టోర్నీలో పాల్గొన్నాయి. తొలుత జరిగిన 10 ఓవర్ల పోటీలో పూర్ణ సీసీ జట్టుపై రాజేష్ సీసీ జట్టు విజయం సాధించింది. పోటీలు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయని నిర్వాహకులు సందెపోగు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పున్నారావు, శ్యాంసన్, కొత్తపల్లి దాసుబాబు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

- భర్త, కూతురికి స్వల్పగాయాలు
- ముగ్గురూ కలిసి స్కూటీపై వెళ్తుండగా దుర్ఘటన



ప్రమాదస్థలంలో తీవ్ర గాయాలతో మహిళ

పిడుగురాళ్ల: స్కూటీని వెనుక నుంచి లారీ ఢీకొనడంతో మహిళ మృతి చెందిన ఘటన పట్టణంలోని కొండమోడు రోడ్డులోని బాలాజీ వేబ్రిడ్జి వద్ద గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన ఎం.లక్ష్మి(40), ఆమె భర్త శ్రీనివాసరావు, కూతురు స్కూటీపై నర్సరావుపేట వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలోనే వెనుక నుంచి వస్తున్న లారీ స్కూటీని ఢీకొనటంతో లక్ష్మి తీవ్రంగా గాయపడింది. భర్త శ్రీనివాసరావుకు, కూతురుకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన లక్ష్మిని తొలుత నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషయమించటంతో మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆమె మృతి చెందారు. పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు తెలిపారు.